క్లుప్తంగా

'పొంగులేటి' విజయాన్ని కోరుతూ పూజలు

కూసుమంచి: పాలేరు కాంగ్రెస్ అభ్యర్థి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఘన విజయం సాధించాలని కోరుతూ శనివారం ముత్యాలగూడెం గ్రామానికి చెందిన వైఎస్సార్‌టీపీ, కాంగ్రెస్ నాయకులు జీళ్లచెరువు శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. ఎన్నికల ఫలితాల్లో పొంగులేటి భారీ మెజార్టీతో గెలుపొందాలని, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారాన్ని చేపట్టాలని ఈ సందర్భంగా పూజలు చేసినట్లు నాయకులు తెలిపారు. ఈ పూజల్లో నాయకులు ఊడుగు సుధాకర్, నాగెల్లి వినోద్, వంశీ, వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలలో 'తుమ్మల'..



స్వామి వారి దర్శనానికి వెళ్తున్న మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మంవన్‌టౌన్: ఖమ్మం అసెంబ్లీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి, మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శనివారం ఉదయం తిరుమల వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా తలనీలాలు స్వామికి సమర్పించుకున్నారు. నేడు(ఆదివారం) ఖమ్మంలో జరిగే ఎన్నికల కౌంటింగ్‌లో పాల్గొనేందుకు రాత్రి తిరిగి ఖమ్మం చేరుకున్నారు.

దివ్యాంగులకు ఉచిత న్యాయ సాయం

ఖమ్మంలీగల్: దివ్యాంగులు ఎక్కడైనా గౌరవంగా జీవించే హక్కు ఉందని, వారికి ఉచిత న్యాయ సాయం అందుతుందని డీఎల్‌ఎస్‌ఏ చీఫ్ డిఫెన్స్ కౌన్సిల్ మామిడి హనుమంతరావు పేర్కొన్నారు. శనివారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యాన ప్రపంచ వికలాంగుల దినోత్సవం సందర్భంగా నగరంలోని వికలాంగుల హాస్టల్‌లో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులకు సంబంధించిన చట్టాలను వివరించారు. ది రైట్స్ ఆఫ్ పర్సన్స్ విత్ డిజేబిలిటీస్ యాక్ట్–2016 గురించిఅవగాహన కల్పించారు. హాస్టల్ వార్డెన్‌లు సుమలత, విజయకుమారి, దివ్యాంగులు పాల్గొన్నారు.

'తమ్మినేని' నివాళి



నివాళులర్పిస్తున్న తమ్మినేని, తదితరులు

ఖమ్మంరూరల్: మండలంలోని గోళ్లపాడుకు చెందిన సీపీఎం సీనియర్ నాయకులు ఏనుగు సీతారాంరెడ్డి(82) ఈనెల 30న ఓటు వేసిన అనంతరం హఠాన్మరణం చెందగా.. శనివారం అమెరికా నుంచి ఆయన కుమారుడు రావడంతో అంత్యక్రియలు నిర్వహించారు. కాగా, సీతారాంరెడ్డి మృతదేహాన్ని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం సందర్శించి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో పలు పార్టీల నాయకులు బి.రమేశ్, నంద్ర ప్రసాద్, కొండం కరుణాకర్, మద్ది వెంకటరెడ్డి, చామకూరి రత్నం, చైతన్య, మద్ది వీరారెడ్డి, మద్ది మల్లారెడ్డి, మందటి వెంకటరెడ్డి, షాబాదు మాధవరెడ్డి తదితరులు ఉన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	యానిమల్
వినోద	యానిమల్
సాయిరాం	అధర్వ
ఆదిత్య	ఆది కేశవ
శ్రీనివాస	కలింగ్ సహస్ర
సుందర్	బ్రీత్

- ఖమ్మంగాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	34	బచ్చలికూర	3
వంకాయ	36		10
బెండకాయ	40	పాలకూర	3
పచ్చిమిర్చి	36		20
కాకర	40	చుక్కకూర	3
బోడ కాకర	100		20
బీర	50	తోటకూర	3
దొండ	34		10
పొట్లకాయ	30	గోంగూర	2
చిక్కుడు	56		10
గోరుచిక్కుడు	46	మెంతికూర	2
క్యాబేజీ	18		10
క్యాలీఫ్లవర్	25	కొత్తిమీర	1
ఆలుగడ్డ	60		30
చామగడ్డ	40	పుదీన	1
క్యారెట్	40		20
క్యాప్సికం	50	-ఖమ్మం వ్యవసాయం	

పోషకాల పండ్లు..



ఖమ్మం నగరంలోని కాల్వొడ్డులో పండ్ల విక్రయాలు

కాలానుగుణంగా అందుబాటులో వివిధ రకాల ఫలాలు

- రోగ నిరోధక శక్తిని పెంచే ఫలాలకు ప్రాధాన్యం
- కరోనా తర్వాత అధికంగా విక్రయిస్తున్న వైనం
- మార్కెట్‌లో లభ్యతను బట్టి ధరలు
- జోరుగా సాగుతున్న విక్రయాలు

ఆరోగ్యకరమైన జీవన శైలిలో పండ్లు (ఫలాలు) ప్రముఖ పాత్ర పోషిస్తాయి. ఇవి మన శరీరానికి కావాల్సిన విటమిన్లు, ఎంజైములు, ఖనిజాలు వంటి పలు రకాల పోషకాలను అందించి ఆరోగ్యంగా ఉంచుతుంది. అంతేకాక రోగ నిరోధక శక్తిని పెంచి వైరస్‌లు, బ్యాక్టీరియాల నుంచి కాపాడేందుకు దోహదపడతాయి. శీతాకాలంలో అనేక రకాల పండ్లు లభిస్తుండగా.. వైద్యులు ఆరోగ్యాన్ని రక్షించే, వ్యాధి నిరోధక శక్తినిచ్చే ఫలాలను తినాలని సూచిస్తుండడంతో మార్కెట్‌లో పండ్ల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ప్రస్తుత సీజన్‌లో విక్రయిస్తున్న ఫలాలపై సండే స్పెషల్. - ఖమ్మంగాంధీచౌక్

ఫలకాలం శీతాకాలం..

ఏ కాలంలో లభించే పండ్లను ఆ కాలంలో తినడం వల్ల ఆరోగ్యం రక్షించబడుతుంది. ఫలకాలంగా పిలువబడే శీతాకాలంలో వివిధ రకాల పండ్లు లభిస్తూ మార్కెట్‌లో అందుబాటులో లభిస్తున్నాయి. ప్రస్తుతం మార్కెట్‌లో సీతాఫలాలు, జామ, కమలాలు, యాపిల్, దానిమ్మ, బొప్పాయి, ద్రాక్ష, యాపిల్ బేర్, డ్రాగన్ ఫ్రూట్, అరటి వంటి పండ్లు లభిస్తున్నాయి.

లభ్యతను బట్టి డిమాండ్..

మార్కెట్‌లో పండ్లకు డిమాండ్ బాగానే ఉంది. పంట కాలం, లభ్యతను బట్టి ఫలాల ధరలు ఉంటున్నాయి. రైతులు నేరుగా మార్కెట్‌కు తీసుకువచ్చి విక్రయించే పండ్లకు తక్కువ డిమాండ్ ఉంటుండగా, వ్యాపారులు విక్రయించే పండ్లకు మాత్రం ధరలు ఎక్కువగా ఉంటున్నాయి. కొందరు వ్యాపారులు పంట సాగయ్యే ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుంటుండగా.. మరికొందరు నాగపూర్, బెంగళూరు, ముంబయి, హైదరాబాద్, విజయవాడ పెద్ద మార్కెట్ల నుంచి పండ్లను దిగుమతి చేసుకొని విక్రయిస్తున్నారు. ప్రస్తుతం సీతాఫలాలు కిలో రూ.100, కమలాలు 2 నుంచి 3 కిలోలు రూ.100, బొప్పాయి కిలో రూ.100, దానిమ్మ కిలో రూ.200, యాపిల్ రూ.150, రేగిపండ్లు కిలో రూ.70, యాపిల్ బేర్ రూ.70, డ్రాగన్ ఫ్రూట్ కిలో రూ.150లుగా విక్రయిస్తున్నారు.

ఫలాలు.. ప్రయోజనాలు

- **జామ:** తక్కువ ధరకు లభించే ఈ జామలో సీ విటమిన్ మెండుగా ఉంటుండగా.. విటమిన్ ఏ,బీలు, ఐరన్, ఫోలిక్ యాసిడ్ వంటివి లభిస్తాయి. జీర్ణశక్తిని పెంపొందించే ఫైబర్ ఈ ఫలంలో పుష్కలంగా లభిస్తుంది.
- **సీతాఫలం:** పోషకాల సమాహారం, అనారోగ్యాల నివారిణి సీతాఫలమని చెప్పొచ్చు. ఈ ఫలంలో పిండి పదార్థాలు, ప్రోటీన్లు, పీచు పదార్థాలు లభిస్తాయి. ఈ ఫలంలో విటమిన్ సీతో పాటు కెరోటిన్, థయామీన్, రైబోఫ్లోవిన్, నియాసిన్ వంటి విటమిన్లు ఉంటాయి. అంతేకాక జీర్ణక్రియను మెరుగుపరిచి మలబద్ధకాన్ని దూరం చేస్తుంది. పాస్పరస్, కాల్షియం, ఇనుము వంటి పోషకాలు ఉండడంతో ఎముకలు పటిష్టంగా తయారవుతాయి.
- **కమలం:** ఈ ఫలంలో విటమిన్ సీ ఉంటుంది. బ్యాక్టీరియాలను ఎదుర్కొవడంతో పాటు చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది.
- **ఆపిల్:** ఈ కాయలో పీచు పదార్థం ఎక్కువగా ఉండడంతో పాటు కొల్రస్టాల్‌ను అదుపులో ఉంచుతూ ఆరోగ్యాన్ని కాపాడుతుంది.
- **దానిమ్మ:** రోగి నిరోధక శక్తిని పెంచే ఫలాల్లో దానిమ్మ ఒకటి. విటమిన్ సీ, కే ఉంటుండగా.. మెదడువాపును తగ్గించటంతో పాటు అల్జీమర్స్‌ను నియంత్రిస్తుంది.
- **బొప్పాయి:** అజీర్తితో బాధపడే వారికి బొప్పాయి దివ్య ఔషదంగా పనిచేస్తుంది. విటమిన్ సీ,ఏలు లభిస్తాయి.
- **అరటి:** ఏడాది పొడవునా లభించే ఫలాల్లో అరటి ఒకటి. ఈ పండు ద్వారా శరీరానికి అవసరమైన శక్తి, సహజ చక్కెరలు లభిస్తాయి. ఈ పండులో పీచు పదార్థాలు ఎక్కువగా ఉండడంలో పాటు రక్త పోటును తగ్గిస్తుంది.

పండ్లు అధికంగా కొంటాం..



ఫలాలను ఎక్కువగా ప్రాధాన్యం ఇస్తాం. ఏ సీజన్‌లో లభించే పండలను ఆ సీజన్‌లో కొనుగోలు చేస్తుంటాం. తక్కువ ధరలకు లభించే జామ పండ్లను ఎక్కువగా తింటుంటాం. ప్రస్తుతం ఖమ్మం వంటి మార్కెట్లలో కమలాలు, జామ, సీతాఫలాలు అధికంగా లభిస్తున్నాయి. - ఉల్లిబోయిన సైదులు, ట్యాక్స్ అసోసియేషన్ ప్రతినిధి ఖమ్మం

లభ్యతను బట్టి డిమాండ్..



పండ్ల లభ్యతను బట్టి ధరలు ఉంటాయి. పంట సీజన్‌లో ధరలు కొంత అనుకూలంగా ఉంటాయి. కరోనా కాలం నుంచి పండ్లకు ప్రాధాన్యం పెరిగింది. దీంతో పండ్ల తోటల సాగు పెరిగి ఉత్పత్తి పెరిగినప్పటికీ పండ్లకు డిమాండ్ మాత్రం తగ్గలేదు. - ఉతపాల రమ, పండ్ల వ్యాపారి, కాల్వొడ్డు

పండ్ల తోటలకు ప్రాధాన్యం..



ప్రజలు ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. దీంతో పండ్ల తోటల పెంపకానికి ఉద్యాన శాఖ అధిక ప్రాధాన్యం ఇస్తుంది. జిల్లాలో విస్తారంగా పండ్ల తోటలను పెంచే ప్రక్రియ కొనసాగుతోంది. ప్రభుత్వం పండ్ల తోటల పెంపకానికి ఇస్తున్న ప్రోత్సాహకాలను రైతులు వినియోగించుకోవాలి. - జి.అనసూయ, జిల్లా ఉద్యాన అధికారి

ఘనంగా శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణం





పూజలో పాల్గొన్న భక్తులు (ఇన్‌సెట్) స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

ఖమ్మంఅర్బన్: నగరంలోని 4వ డివిజన్ యూపీహెచ్ కాలనీలోని స్వయంభు శ్రీ అభయ వేంకటేశ్వరస్వామి కల్యాణ వేడుకలను శనివారం ఆలయ కమిటీ వారి ఆధ్వర్యాన ఘనంగా నిర్వహించారు. ప్రతీ శనివారం నిర్వహిస్తున్న ఈ మహోత్సవ వేడుకలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై పూజలో పాల్గొంటున్నారు. భక్తుల సహకారంతోహాజరైన వందలాది మంది భక్తులకు అన్నదానం చేస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు మేకల వీరన్న, ప్రధాన కార్యదర్శి గుగులోతు మణికంఠం, కోశాధికారి గుడిమల్ల నాగేశ్వరావులు తెలిపారు.

వెంకటేశ్వర్లు జీవితం ఆదర్శం



మాట్లాడుతున్న పోటు ప్రసాద్

ఖమ్మంరూరల్: భూస్వామ్య గుండాల చేతుల్లో అత్యంత కిరాతకంగా హత్య గావించబడిన పుచ్చకాయల వెంకటేశ్వర్లు జీవితం నేటి యువతకు ఆదర్శమని సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ అన్నారు. మండలంలోని గూడురుపాడులో జరిగిన వెంకటేశ్వర్లు 52వ వర్ధంతిలో ఆయన మాట్లాడుతూ.. వెట్టి చాకిరి విముక్తి, అంటరానితనానికి వ్యతిరేకంగా పేదల పక్షాన అలుపెరుగని పోరాటాలు నిర్వహించిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. ప్రస్తుత పాలకులు ఆనాటి రోజులను గుర్తు చేస్తున్నారని, వారిని పారదోలాల్సిన అవసరం ప్రతీ ఒక్క ప్రజాస్వామ్యవాదిపై ఉందని తెలిపారు. అదే విధంగా వరంగల్ క్రాస్‌రోడ్‌కు చెందిన సీపీఐ నాయకుడు శనగల శివశంకర్(45) అనారోగ్యంతో మృతిచెందగా.. నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేశ్, నాయకులు పుచ్చకాయల సుధాకర్, సిద్ధినేని కర్ణకుమార్, బండి ఉపేందర్, మారుతి రామారావు, పాడేటి అంజయ్య పాల్గొన్నారు.

పొత్తు ధర్మాన్ని నిర్వర్తించాం..



మాట్లాడుతున్న అయోధ్య

నేలకొండపల్లి: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీతో సీపీఐ పొత్తు ధర్మాన్ని నిర్వర్తించామని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కాశిబోయిన అయోధ్య అన్నారు. మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీపీఐ అధిష్టానం మేరకు ఎన్నికలలో శక్తి వంచన లేకుండా పని చేసినట్లు తెలిపారు. పాలేరులో పొంగులేటి శ్రీనివాసరెడ్డి భారీ మెజార్టీతో విజయం సాధించనున్నారని, అందుకు సీపీఐ, ప్రజాసంఘాలు, సైనికుల్లా పని చేసినట్లు పేర్కొన్నారు. కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై బీజేపీ, బీఆర్‌ఎస్‌పై ఉద్యమాలు చేసినట్లు చెప్పారు. ఉపాధి కూలీలకు అందాల్సిన వేతనాలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పని అడిగిన ప్రతీ ఒక్కరికి ఉపాధి పనులు కల్పించాలని కోరారు. లేనిపక్షంలో కూలీలకు పరిహారం ఇవ్వాలన్నారు. వెంటనే పెండింగ్ బిల్లులు విడుదల చేయకపోతే ప్రత్యక్ష ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదు



కామేపల్లి: మాట్లాడుతున్న ఎస్సై ప్రవీణ్‌కుమార్

కామేపల్లి/తిరుమలాయపాలెం/నేలకొండపల్లి/రఘునాథపాలెం/కూసుమంచి: అసెంబ్లీ ఎన్నికల అభ్యర్థుల ఫలితాల్లో భాగంగా మండలాల్లోని అన్ని గ్రామాల్లో 144 సెక్షన్ అమలులో ఉంటుందని రఘునాథపాలెం, కూసుమంచి సీఐలు శ్రీధర్, జితేందర్‌రెడ్డి, కామేపల్లి, తిరుమలాయపాలెం, నేలకొండపల్లి ఎస్సైలు ప్రవీణ్‌కుమార్, వరాల శ్రీనివాస్, బి.సతీష్, శనివారం కొందరు ఓ ప్రకటనలో తెలపగా.. మరికొందరు విలేకరుల సమావేశంలో పేర్కొన్నారు. గ్రామాల్లో ఎటువంటి ర్యాలీలు నిర్వహించవద్దని, డీజేలు ఉపయోగించరాదని పేర్కొన్నారు. బాణాసంచా కాల్చొద్దని, నలుగురు కంటే ఎక్కువ మంది ఒకే చోట ఉండొద్దని, రెచ్చగొట్టే ప్రసంగాలు చేయొద్దని తెలిపారు. ఫలితాల తర్వాత ఎలక్షన్ కమిషన్ అనుమతితో మాత్రమే విజయోత్సవ ర్యాలీ నిర్వహించుకోవాలని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరంగా కఠిన చర్యలు ఉంటాయని, సమస్యాత్మక గ్రామాల్లో ప్రత్యేక నిఘా ఉంటుందని చెప్పారు. పోలీసులకు అన్ని పార్టీల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు సహకరించాలని కోరారు.

వేంకటేశ్వర గోశాలలో గోపూజ



హారతి ఇస్తున్న అర్చకుడు

ఖమ్మంఅర్బన్: నగరంలోని 7వ డివిజన్ టేకులపల్లిలోని శ్రీ వేంకటేశ్వర గోశాలలో కార్తీక మాసాన్ని పురస్కరించుకొని శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోశాలలో భక్తులు గోవులకు పూజలు చేసి దాన అందించారు. గోశాల నిర్వాహకుడు, అర్చకుడు ఆరుట్ల శ్రీనివాసచార్యులు గోపూజ నిర్వహించి భక్తులకు హారతి ఇచ్చారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచారు.

కౌంటింగ్ కేంద్రాల వద్దకు సకాలంలో హాజరు కావాలి

నేలకొండపల్లి: గత నెల 30న జరిగిన అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ కౌంటింగ్ ఏర్పాట్లను పూర్తి చేసినట్లు పాలేరు రిటర్నింగ్ అధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం.రాజేశ్వరి తెలిపారు. శనివారం చాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. పాలేరు బరిలో ఉన్న 37 మంది అభ్యర్థులు, వారు ఎంపిక చేసుకున్న ఏజెంట్లు ఆదివారం కౌంటింగ్ కేంద్రాల వద్దకు సకాలంలో హాజరు కావాలన్నారు. ఉదయం 6 గంటలకు పోస్టల్ బ్యాలెట్ స్ట్రాంగ్ రూమ్, ఈవీఎం స్ట్రాంగ్ రూమ్‌ల వద్దకు చేరుకోవాలని సూచించారు. పాన్నెకల్లు వద్ద జరిగే ఓట్ల లెక్కింపునకు అభ్యర్థులు హాజరు కావాలని, కౌంటింగ్ సజావుగా జరిగేందుకు సహకరించాలని తెలిపారు. ఎన్నికల సంఘం, జిల్లా అధికార యంత్రాంగం ఆదేశాలు మేరకు నిబంధనలు కచ్చితంగా పాటించాలని సూచించారు.

వైద్య రంగానికి అధిక నిధులు ఇవ్వాలి



మందులు అందజేస్తున్న నున్నా నాగేశ్వరరావు

ఖమ్మంమయూరిసెంటర్: నూతనంగా తెలంగాణలో ఏ పార్టీ ప్రభుత్వం వచ్చినా ప్రజలకు కీలక రంగంగా ఉన్న ఆరోగ్యశాఖకు అధిక నిధులు కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు కోరారు. సీపీఎం టూటౌన్ కమిటీ, బీవీకే ఆధ్వర్యాన జరిగే నెలనెలా ఉచిత మెడికల్ క్యాంపు శనివారం మంచికంటి హాల్‌లో నిర్వహించారు. వైద్యుల పర్యవేక్షణలో 500 మందికి షుగర్, బీపీ, ఫిట్స్ పరీక్షలు నిర్వహించి నెలకు సరిపడా మందులు అందజేశారు. కంటి, ముక్కు, గొంతు పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ప్రజల జీవితాల్లో విద్య, వైద్య రంగాలు కీలక భూమిక పోషిస్తాయని, ఈ రెండింటినీ పూర్తిగా ప్రభుత్వపరం చేయాలని కోరారు. ఉచితంగా విద్యార్థులకు చదువుకొనే అవకాశం ఇవ్వాలని, అలాగే ప్రజల ప్రాణాలతో ముడిపడి ఉన్న ఆరోగ్య రంగాన్ని ప్రభుత్వం తన అధీనంలో తీసుకుని తగిన చర్యలు చేపట్టాలన్నారు. మూడు రాష్ట్రాల నుంచి రోగులు ఖమ్మం నగరానికి వస్తున్నారని, వెంటనే నగరంలో నిమ్స్ తరహాలో నూతన ప్రభుత్వ ఆస్పత్రి నిర్మాణం చేపట్టాలని అన్నారు. ఈ శిబిరంలో ప్రముఖ వైద్యులు సి.భారవి, కొల్లి అనుదీప్, జెట్ల రంగారావు, పిల్లలమర్రి సుబ్బారావు, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు వై.విక్రమ్, నాయకులు మాదినేని రమేశ్, పి.ఝాన్సీ, బోడపట్ల సుదర్శన్, శివనారాయణ, అఫ్రుల్, వాసిరెడ్డి వీరభద్రం, పి.వాసు, జె.వెంకన్నబాబు, భద్రం, పి.కృష్ణారావు, టి.జనార్దన్ స్వామి, టి.వెంకట్రావు, వి.మోహన్ తదితరులు పాల్గొన్నారు.

రేపల్లెవాడలో ఉచిత వైద్య శిబిరం



మందులు పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది

కామేపల్లి: గ్రామాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యాన ఏర్పాటు చేస్తున్న ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ చందన అన్నారు. శనివారం మండలంలోని రేపల్లెవాడలో పీహెచ్‌సీ ఆధ్వర్యాన ఉచిత వైద్య శిబిరం నిర్వహించిన సందర్భంగా ఆమె మాట్లాడారు. పీహెచ్‌సీలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని పేర్కొన్నారు. ఆరోగ్య ఉపకేంద్రాల్లో వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలని, సీజనల్ వ్యాధులు రాకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గెలుపు,ఓటములపై లెక్కలు షురూ..



ఖమ్మంరూరల్: అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ముగియడంతో పాలేరు నియోజకవర్గంలోని ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థుల అనుచరులు, ద్వితీయ శ్రేణి నాయకులు తమ తమ అభ్యర్థుల గెలుపు ఓటములపై లెక్కలు వేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. ఎక్కడెక్కడా తమకు ఎక్కువ, తక్కువ ఓట్లు పోలయ్యాయో గ్రామాలవారీగా వివరాలు సేకరిస్తున్నారు. నియోజకవర్గంలో మొత్తం 2,36,287 ఓటర్లు ఉండగా.. 2,14,770 మంది ఓటేయగా 90.89 శాతం పోలింగ్ నమోదైంది. తాము ఇచ్చిన డబ్బులకు తగిన విధంగా ఓట్లు పడ్డాయా, లేదా అంటూ ఎక్కడెక్కడ ఎలా ఓట్లు పోలయ్యాయనే వివరాలతో ఆయా పార్టీల నాయకులు పోటీలో ఉన్న అభ్యర్థులకు చూపిస్తూ చర్చించుకున్నారు. ఎక్కడైనా క్రాస్ ఓటింగ్ జరిగిందా? అలా జరిగితే తమకేమైనా లాభం చేకూరుతుందా? అనే ఆశతో కొందరు నాయకులు లెక్కలు తీసే పనిలో నిమగ్నమయ్యారు. అదే విధంగా ఏఏ సామాజిక వర్గాలు తమకు అనుకూలంగా ఓటు వేశారు, తాము ఎన్నికల్లో అనుసరించిన వ్యూహాలు ఎంత మేరకు ప్రభావం చూపాయనే అంశాలను చర్చిస్తూ గెలుపుపై ఎవరికివారే ధీమా వ్యక్తం చేస్తున్నారు. మరి ఓటర్లు ఎవరిని కరుణించారో నేటితో తెలియనుంది.

ఓటేయడానికి ఎందుకు రాలేదు?

- ఓటింగ్‌కు రాని ఓటర్లను ఆరా తీస్తున్న ప్రధాన పార్టీల అనుచరులు
- తాయిలాలు ఇవ్వడంతో సర్వత్రా చర్చలు



ఖమ్మంఅర్బన్: ఓటర్లను ఆకట్టుకునేందుకు వివిధ రాజకీయ పార్టీలు, బరిలో నిలిచిన అభ్యర్థులు ఓటర్లను మచ్చిక చేసుకోవడానికి రకరకాల వాగ్దానాలు, తాయిలాలు ఇచ్చి తమకే ఓట్లు వేయాలని అభ్యర్థించిన విషయం విదితమే. కాగా, చాలామంది ఓటు వేయడానికి రాకపోవడంతో ప్రధాన పార్టీల అభ్యర్థుల తరఫున వారి పార్టీ కార్యకర్తలు, అనుచర గణం ఓటర్లకు ఫోన్ చేసి ఓటేసేందుకు ఎందుకు రాలేదని ప్రశ్నిస్తున్నట్లు సమాచారం. ఓటర్ల జాబితా ప్రకారం పంపకాలు చేసే సమయాన ఓటర్ల పేరు వద్ద గుర్తులు పెట్టుకున్నట్లు, తాయిలాలు అందుకొని ఓటింగ్‌కు రానివారికి పోలింగ్ ముగిసిన తర్వాత శుక్ర, శనివారాలు ఫోన్ చేసి తాయిలాలు తీసుకుని ఓటేయడానికి ఎందుకు రాలేదని అడుగుతున్నట్లు తెలిసింది. దీనికి వారు రాకపోవడానికి రకరకాల కారణాలు చెబుతున్నట్లు సమాచారం. దీంతో అభ్యర్థన సమయం అయిపోయింది.. నాయకుల డిమాండ్ పెరిగిందని చెప్పొచ్చు.